# దుమ్ము..ధూళి చెరలో పంట చేలు

- తగ్గిపోతున్న పంటల దిగుబడి
- ఆదాయం తగ్గిపోయి నష్టపోతున్న రైతులు
- వాటరింగ్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఇటుక బట్టీల యజమానులు

జి.కొండూరు: సాగు చేయలేక కొందరు రైతులు తమ భూములను ఇటుక బట్టీలకు లీజుకిచ్చారు. సాగే జీవితంగా మరికొందరు రైతులు వ్యవసాయం చేస్తున్నారు. అయితే లీజుకిచ్చిన రైతులు సేఫ్ జోన్‌లో ఉండగా వ్యవసాయం చేస్తున్న రైతులు బట్టీల నుంచి వచ్చే దుమ్ము..ధూళితో నష్టపోతున్నారు. నిత్యం డస్టు, మట్టి, బొగ్గు, ఊక, ఇటుక రవాణా చేసే వాహనాల రాకపోకలతో వచ్చే దుమ్ము..ధూళి పడి పక్కనే సాగవుతున్న పంటలు దిగుబడి తగ్గిపోతున్నాయి. రహదారులపై వాటరింగ్ చేయాల్సిన ఇటుక బట్టీల నిర్వాహకులు కొందరు నిర్లక్ష్యం వహించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



కుంటముక్కల గ్రామ శివారులో దుమ్ముతో నిండిపోయిన మొక్కజొన్న పంట



మొక్కజొన్న ఆకులపై చేరిన దుమ్ముతో రంగు మారిన ఆకులు

### మూడు గ్రామాల్లో..

జి.కొండూరు మండల పరిధి వెల్లటూరు, కుంటముక్కల, చిన్న నందిగామ గ్రామాల పరిధిలో ఇటుక బట్టీల నిర్వహణ గత కొన్నేళ్లుగా జరుగుతోంది. ఈ ప్రాంతాల్లో నీటి కొరత లేనప్పటికీ వ్యవసాయంపై ఆదాయం తగ్గడంతో రైతులు తమ భూములను బట్టీల నిర్వహణకు లీజుకిచ్చారు. ఈ గ్రామాల పరిధిలో 40 మంది వరకు బట్టీలను నిర్వహిస్తున్నారు. అయితే ఈ గ్రామాల్లో వ్యవసాయం చేస్తున్న రైతులు బట్టీల నిర్వహణతో ఇబ్బంది పడుతున్నారు. బట్టీలకు మట్టి, డస్టు, ఊక, బొగ్గు రవాణా చేసే వాహనాలతో పాటు తయారైన ఇటుకలను రవాణా చేసే వాహనాలతో వచ్చే తీవ్రమైన దుమ్ము..ధూళితో బట్టీలకు పక్కనే సాగవుతున్న పంటలు దిగుబడి తగ్గిపోతున్నాయి. బట్టీల నిర్వాహకులు కొందరు దుమ్ము లేవకుండా ఉండేలా వాటరింగ్ చేస్తున్నప్పటికీ కొందరు నిర్లక్ష్యం వహించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

### దిగుబడులపై ప్రభావం

సాగుచేస్తున్న పంటలపై దుమ్ము, దూళి ఎక్కువగా చేరడం వల్ల పంట దిగుబడిపై ప్రభావం పడుతోందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మొక్కలపై దుమ్ము పడినప్పుడు కిరణజన్య సంయోగ క్రియ సక్రమంగా జరుగక మొక్కలు ఆరోగ్యంగా ఎదగలేక నష్టం వాటిల్లుతోందని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా పరపరా గసంపర్కం సక్రమంగా జరుగక దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరిస్తున్నారు. ఈ మూడు గ్రామాల్లో రబీలో మొక్కజొన్న 40.33 ఎకరాలు, వరి 96.68 ఎకరాల్లో సాగవుతోంది.

### పెట్టుబడి కూడా రాక

ఇటుక బట్టీలలోకి రాకపోకలు సాగించే వాహనాల దుమ్ము, ధూళి చేరి మొక్కజొన్న, వరి పంటలు దిగుబడి తగ్గిపోయి పెట్టుబడి కూడా రాక రైతులు నష్టపోతున్నారు. మొక్కజొన్న అయితే ఎకరానికి 40 క్వింటాళ్లు దిగుబడి రావాల్సింది కేవలం 25 నుంచి 30 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. వరి పంట కూడా సగానికి సగం దిగుబడి తగ్గిపోతోందని వాపోతున్నారు. బట్టీల నిర్వాహకులు నిర్లక్ష్యం వీడి వాటరింగ్ చేస్తే ఎటువంటి సమస్య ఉండదని రైతులు కోరుతున్నారు.

### దుమ్ముతో తీవ్రంగా నష్టపోతున్నాం



రోడ్డుపై వచ్చిపోయే డస్టు, మట్టి వాహనాలతో దుమ్ములేచి మొక్కజొన్న పంటపై పడుతోంది. కుంటముక్కల శివారులో రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. ఎకరానికి 40 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా 25 నుంచి 30 క్వింటాళ్లు మాత్రమే వస్తోంది. బట్టీల యజమానులు దుమ్ము లేవకుండా వాటరింగ్ చేస్తే సమస్య పరిష్కారమవుతుంది.

–మాదు పుల్లయ్య, మొక్కజొన్న రైతు, మైలవరం

### రూ. 20 వేలు కౌలు కట్టాలి



కుంటముక్కల గ్రామ శివారులో కౌలుకి తీసుకొని నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నా. బట్టీలకు వచ్చిపోయే వాహనాలతో దుమ్ములేచి మొక్కజొన్న పంటపై పడుతోంది. దీని వల్ల దిగుబడి తగ్గిపోతుంది. ఎకరానికి రూ.20 వేలు కౌలు కట్టాలి. పెట్టుబడి కూడా రావడం లేదు. బట్టీల యజమానులు వాటరింగ్ చేస్తే మాకు సమస్య ఉండదు.

– కోట జగన్‌మోహన్‌రావు, మొక్కజొన్న రైతు, మైలవరం

## భూముల రీసర్వేలో లోపాలను సరిచేయాలి



చాట్రాయి: రీ సర్వేలో లోపాలను సరి చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని చిన్నంపేట గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన రీ సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు రీ సర్వే చేసిన భూముల్లో విస్తీర్ణం హెచ్చుతగ్గులు, సర్వే నంబర్ తప్పులు పడ్డాయని సబ్ కలెక్టర్‌కి విన్నవించారు. త్వరితగతిన రీ సర్వేలో వచ్చిన తప్పులను సరిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్ రంగారావు, తహసీల్దార్ డి ప్రశాంతి, మండల సర్వేయర్లు ప్రేమ్‌కుమార్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 24న కౌన్సిల్ సమావేశం

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 24న జరుగుతుందని కమిషనర్ లోవరాజు తెలిపారు. ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగే సమావేశంలో కౌన్సిలర్లు ప్రతిపాదించిన పలు అంశాలపై చర్చించనున్నామని చెప్పారు.

## టమాటా రైతులు అధైర్య పడవద్దు

జిల్లా ఉద్యాన అధికారి బాలాజీ కుమార్

జి.కొండూరు: టమాటా రైతులు తమ పంటను నేరుగా రైతు బజార్లలో విక్రయించుకునే వీలును ప్రభుత్వం కల్పిస్తుందని జిల్లా ఉద్యాన అధికారి పి. బాలాజీ కుమార్ అన్నారు. మండల పరిధి గడ్డమణుగు గ్రామ శివారులో సాగవుతున్న టమాటా పంటను శనివారం ఆయన స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ టమాటా విక్రయాలు సక్రమంగా జరిగేలా ఉద్యానశాఖ, మార్కెటింగ్ శాఖ కలిసి సంయుక్తంగా చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖాధికారి నీలిమ, వీహెచ్‌ఏ గౌరి, రైతులు పాల్గొన్నారు.

## పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి

డీపీఓ అనురాధ

నూజివీడు: పంచాయతీల్లో పన్నుల వసూళ్లను వేగవంతం చేసి వంద శాతం వసూళ్లు సాధించాలని డీపీఓ అనురాధ పేర్కొన్నారు. మండలంలోని కొత్త రావిచర్లలోని సంపద సృష్టి కేంద్రాన్ని శనివారం డీపీఓ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో పొడిచెత్త, తడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద సృష్టి కేంద్రానికి తరలించాలన్నారు. అందులో వానపాముల ఎరువు తయారయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఎల్‌పీఓ సుందరి, సర్పంచి కాపా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వృద్ధాశ్రమాన్ని సందర్శించిన అదనపు జిల్లా జడ్జి



నూజివీడు: తుక్కులూరులోని జేబీఎల్ వృద్ధాశ్రమాన్ని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ శనివారం సందర్శించారు. వృద్ధాశ్రమంలోని వృద్ధుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. జడ్జి నాగ శైలజ మాట్లాడుతూ వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తరచూ ఆశ్రమానికి వచ్చి పెద్దల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని చెప్పారు. న్యాయవాదులు గోపీనాథ్, ఎం. రవికాంత్, తిరువీధి కృష్ణ, పారా లీగల్ వలంటీర్స్ వేణుగోపాల్, వృద్ధాశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

### విజేతలకు బహుమతుల ప్రదానం

మైలవరం: మాతృ భాషపై పట్టు సాధిస్తేనే ఇతర భాషలు నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందని చిలుకూరువారిగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. నారాయణరావు అన్నారు. మైలవరం ఎస్వీఆర్జీ ఎన్నార్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాతృ భాషా దినోత్సవం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. సతీష్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం నారాయణరావు మాట్లాడుతూ మాతృ భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పద్య పఠనం, వ్యాసరచన, వక్తృత్వ, కథలు చెప్పడం, పద్యాలకు భావాలు రాయడం తదితర అంశాలలో నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల కార్యదర్శి జ్ఞానప్రకాశరావు, తెలుగు ఉపాధ్యాయులు పి. శ్రీనివాసరావు, ఆర్‌వీఎస్ఆర్ కృష్ణారావు, రవికుమార్, రత్తయ్య పాల్గొన్నారు.

### టీబీ నివారణ మాసోత్సవాలు ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టీబీ నివారణ మాసోత్సవాలు శనివారం ప్రారంభించారు. 'అవును మేము క్షయ వ్యాధి అంతం చేయగలం' అని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పీహెచ్‌సీ క్షయ వ్యాధి యూనిట్ సూపర్‌వైజర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ క్షయ వ్యాధి వంశపారంపర్యంగా కాకుండా ఒక సూక్ష్మ క్రిమి ద్వారా సంక్రమిస్తుందన్నారు. ఇది దీర్ఘకాలిక అంటువ్యాధి అని చెప్పారు. క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన చికిత్స, జాగ్రత్తలు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓ.రామ్మోహనరావు, ఏఎస్‌ఎం విద్యాలత, తదితరులు పాల్గొన్నారు.

### 286 మందికి నేత్ర పరీక్షలు

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లిలోని సెయింట్ బెనెడిక్ట్ హైస్కూల్‌లో శనివారం అయాన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 286 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. హైస్కూల్ ఫాదర్ చిన్నప్ప వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ బషీర్ అహ్మద్, వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు.

### పేదలకు వస్త్రాలు పంపిణీ

మైలవరం: ప్రవాసాంధ్రులు దివంగత లకిరెడ్డి బాలిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సోదరులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి, లకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి వెల్వడం గ్రామంలోని పేద వృద్ధులకు శనివారం పంచెలు, కండువాలు, చీరలు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం వెల్వడం గ్రామంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని వృద్ధులకు నూతన వస్త్రాలను వారు అందజేస్తారు. లకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో తాగునీరు కలుషితం

ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్‌లో కలిసిన బూడిద నీరు

ఇబ్రహీంపట్నం: మైలవరం నియోజకవర్గంలోని 104 గ్రామాలకు తాగునీరు అందించే ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్‌లో బూడిద నీరు కలవడంతో తాగునీరు కలుషితమైంది. బూడిద నీరు సరఫరా చేసే పైపుల లీకేజీతో రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాలతో నియోజకవర్గంలోని 104 గ్రామాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. శనివారం కూడా మరోసారి పైప్‌లైన్లు లీకేజీ కావడంతో చన్నీటి కాలువలో బూడిద కలిసి పంప్‌హౌస్‌లో ఫిల్టర్ బెడ్‌లు మొరాయించాయి.

**ప్రజా పోరాట సమితి ఆందోళన**

విషయం తెలుసుకున్న ప్రజా పోరాట సమితి సభ్యుడు, వార్డు కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్ నేతృత్వంలో వైఎస్సార్ సీపీ నాయకులు పంప్ హౌస్ వద్దకు చేరుకున్నారు. పంప్‌హౌస్‌లో కలిసిన బూడిద నీటిని పరిశీలించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్టీటీపీఎస్ పరిసర గ్రామాల్లో వాతావరణ కాలుష్యంతో స్వచ్ఛమైన గాలి కరువైందన్నారు. ఇప్పుడు స్వచ్ఛమైన తాగునీరు కూడా ప్రజలకు అందించలేని దుస్థితి ఏర్పడిందని చెప్పారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి తాగునీటి కాలుష్యానికి కారకులైన అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీటి కాలుష్య ప్రాంతాన్ని విజయవాడ పర్యావరణ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు ఎన్టీటీపీఎస్ అధికారులతో కలిసి పరిశీలించారు. నీటి శాంపిల్ తీసి ల్యాబ్‌కు పంపించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్లకు బెరమ్స్ వేయాలి

డ్వామా పీడీ రాము

జి.కొండూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ఇటీవల నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లకు వెంటనే బెరమ్స్‌ను వేయాలని డ్వామా పీడీ ఎ. రాము అన్నారు. మండల పరిధి పినపాక గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. గ్రామంలో సీసీ రోడ్లను పరిశీలించిన పీడీ, పంచాయతీరాజ్ ఏఈతో ఫోన్‌లో మాట్లాడి సీసీ రోడ్లకు బెరమ్స్ వెంటనే వేయాలని సూచించారు. అనంతరం ఇదే గ్రామంలో ఉపాధి హామీ పథకంలో ఆర్థికసాయం పొంది సాగు చేస్తున్న మునగతోటను పరిశీలించారు. రైతు క్షేత్రంలో తవ్విన ఫాంపాండ్ (ఇంకుడు గుంత)ను పరిశీలించిన ఆయన మార్చి 10వ తేదీ లోగా ప్రతి గ్రామంలో పది ఫాంపాండ్‌లను తవ్వేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్డును పరిశీలించారు. ఏపీఓ మాధవరెడ్డి, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ రోడ్లను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రాము

## ఘనంగా ఎల్‌బీఆర్ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం

మైలవరం: విద్యార్థులు భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు మంచి కలలు కని వాటిని సాకారం చేసుకోవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాల డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి ఎదిగేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తాను చదువుకున్న కళాశాల ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో టాప్ 100 కళాశాలలో ఒకటిగా చూడాలని ఆకాంక్షించారు. ఎల్‌బీఆర్‌సీటీ ట్రస్టీ, ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నిర్దిష్ట ప్రణాళికలు కళాశాలలోనే ఏర్పాటు చేసుకుని, ఎంచుకున్న రంగంలో నిష్ణాతులవ్వాలన్నారు. కళాశాల కోఫౌండర్, హనరరీ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి, కళాశాల చైర్మన్ లకిరెడ్డి ప్రసాదరెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



కళాశాల వార్షికోత్సవంలో పాల్గొన్న అతిథులు, యాజమాన్యం

## ఉద్యోగాలకు 30 మంది ఎంపిక

విస్సన్నపేట: హైదరాబాద్‌కు చెందిన బహుళజాతి ఔషధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ ఆధ్వర్యంలో విస్సన్నపేట వికాస్ పాలిటెక్నిక్, పీజీ కళాశాలల్లో శనివారం క్యాంపస్ సెలక్షన్స్ జరిగాయి. 100 మంది విద్యార్థులు హాజరు కాగా 30 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారని కళాశాల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి తెలిపారు. ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ ప్రతినిధి చక్రధర్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ చల్లా సుధీర్‌రెడ్డి, వికాస్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రమేష్, డాక్టర్ శ్రీనివాసరావు, వీరబాబు పాల్గొన్నారు.

## విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభం

తిరువూరు: స్థానిక పాత తిరువూరులో పునర్నిర్మించిన ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో ప్రతిష్ఠించనున్న ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహం, బొడ్డురాయి, నాభిశిల, పోతురాజు పరివార దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగించారు. పాత తిరువూరులోని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేళతాళాలు, కోలాట నృత్యాలతో ఊరేగింపు జరిగింది. ఆదివారం ఉదయం విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

## పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి

ఆగిరిపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి అనురాధ ఆదేశించారు. శనివారం ఆగిరిపల్లిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను, గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారుచేసే కేంద్రాన్ని, సగ్గూరు గ్రామంలో జరుగుతున్న స్వమిత్వ సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. డీఎల్‌పీఓ సుందరి, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

## పాడి రైతులకు బహుమతులు

ఆగిరిపల్లి: లేగదూడల పెంపకంలో మెలకువలు పాటించాలని జిల్లా పశుసంవర్థక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. వడ్లమానులో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. పాడి రైతులు పెంచుతున్న లేగ దూడలను పరిశీలించారు. నూజివీడు పశుసంవర్థక శాఖాధికారి చంద్రశేఖర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## 12 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి: సారా విక్రయాలపై దాడులు చేశామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ ఫణికుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోతనపల్లి తండాకు చెందిన భూక్యా భద్రుని అదుపులోకి తీసుకుని పది లీటర్ల సారా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు. తుమ్మగూడెంలో దాడులు నిర్వహించి గ్రామానికి చెందిన చల్లపల్లి జయమ్మను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. రిమాండ్ నిమిత్తం ఇద్దరిని తిరువూరు కోర్టుకు తరలించామని చెప్పారు.

## టీ షర్టులు అందజేత

ఆగిరిపల్లి: స్థానిక జెడ్పీ హైస్కూల్లో సబ్ జోన్ ఆటల పోటీలు నిర్వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు ఆగిరిపల్లి భాగ్యలక్ష్మి ఇండియన్ గ్యాస్ నిర్వాహకులు పాలడుగు శ్రీనివాసరావు టీ షర్టులను అందజేశారు. ప్రధానోపాధ్యాయిని పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు: పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరేందుకు గాను బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. శ్రీలక్ష్మి తెలిపారు. అర్హులైన బాలికలు తమ దరఖాస్తులను మార్చి 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

## సృజనాత్మకత పెంపునకే బాలోత్సవం

తిరువూరు: బాలల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు బాలోత్సవం వంటి కార్యక్రమాలు దారి చూపుతాయని తిరువూరు ఎంఈఓ శ్యాం సుందరరావు అన్నారు. శనివారం తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన బాలోత్సవంలో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. బాలోత్సవ కమిటీ కన్వీనర్ హరికృష్ణ, కోశాధికారి పాపారావు, జనవిజ్ఞాన వేదిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే

ఇబ్రహీంపట్నం: కొండపల్లిలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ టూలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు శనివారం ఘనంగా ఫేర్‌వెల్ డే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ బాజీబీ మాట్లాడుతూ బాలికల విద్య అవనికే వెలుగన్నారు. ప్రముఖ వ్యాపారి కె. వెంకటరమణ పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని ఎస్. శ్రావణి, ఎస్. కల్యాణిలకు ఒక్కొక్కరికీ రూ. 1,116లు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

## త్రోబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నూజివీడు: ఈనెల 21న ఆగిరిపల్లిలో నిర్వహించిన సబ్ జోన్ ఆటల పోటీల్లో యనమదల హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. త్రోబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారని హైస్కూల్ హెచ్‌ఎం ఎంఎస్ నాగరాజు తెలిపారు. నియోజకవర్గ పరిధి నాలుగు మండలాల్లోని ప్రభుత్వ హైస్కూళ్ల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా తమ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు సర్పంచి వరికూటి వెంకటేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ పలగాని శ్రీనివాసరావు, పీడీ టీవీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

## రెడ్డిగూడెం ఫిల్లింగ్ స్టేషన్ తనిఖీ

మైలవరం: రెడ్డిగూడెం గ్రామంలోని వేణుగోపాల ఫిల్లింగ్ స్టేషన్‌ను తహసీల్దార్ జె. సుశీలాదేవి శనివారం తనిఖీ చేశారు. పెట్రోల్ బంకులోని రికార్డులు, ఫైర్, సేఫ్టీ పరికరాలు, తూనికలు, కొలతలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ (పీడీఎస్) బి. శివనాగరాజు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, వీఆర్ఓ జానీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై వాహనం బోల్తా

ఇబ్రహీంపట్నం: జాతీయ రహదారిపై ఇబ్రహీంపట్నం వద్ద బొలేరో వాహనం అదుపు తప్పి శనివారం బోల్తా కొట్టింది. ప్రమాదాన్ని ముందుగా గుర్తించిన వాహన డ్రైవర్, క్లీనర్ వాహనం నుంచి బయటికి దూకేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ ఎస్‌ఐ లక్ష్మణ్ నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.